# తల్లి ప్రేమ

ఆ ఆఫీసులో మొత్తం రెండు వందల యాభై మంది ఉద్యోగులు. అంతమందినీ అదుపుచేసి వారిపై అజమాయిషీ చేసే పెద్ద ఆఫీసర్ని నేను. నేనంటే అందరికీ హడల్! ఎదురు సమాధానం చెప్పేవాళ్ళన్నా, సిఫార్సులతో వచ్చేవాళ్ళన్నా మహా చిరాకు నాకు. నన్ను మెప్పించాలంటే బాగా పనిచేయాలి. ఆ విషయం అందరికీ తెలుసు. అందుకే నా ఆఫీసు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటోంది.

ఈ విషయాలన్నీ నన్ను చూడ్డానికి వచ్చిన నా స్నేహితుడు ప్రసాద్‌కి చెప్పుకున్నాను. అతడు నా చిన్ననాటి స్నేహితుడు. ఇలాంటివి చెప్పుకునేందుకు అతడు తప్ప నా కెవరూ లేరు. ఎందుకంటే అయిదేళ్ళ వయసులో నాన్న పోయాడు నాకు. అమ్మ నన్ను కష్టపడి చదివించి ఆ ఫలితం చూడకుండానే కన్ను మూసింది. అందుక్కారణం కూడా నా చదువే! అమ్మ తన జబ్బును నా చదువు కోసం నిర్లక్ష్యం చేసింది.

అమ్మ నాతో అస్తమానూ "నువ్వు చాలా గొప్పవాడివిరా! చదువు పూర్తయాక వందలాదిమీద అజమాయిషీ చేస్తావు" అంటూండేది. ఏ రికమండేషనూ లేకుండా నా కింత మంచి ఉద్యోగం వచ్చిందంటే అది అమ్మ ఆశీర్వాదబలమే!

ఉద్యోగంలో నా హోదా గురించి నా భార్యకు చెప్పను నేను. అప్పుడు ఆడవాళ్ళు తమ హోదాను దుర్వినియోగం చేస్తారు. స్వంతంగా కారున్నా సరే ఆఫీసు కారును ఇంటి పనులకు వాడుకోవడంలోనూ, ఏ పనీలేకపోయినా తమ క్రింది వారికి ఏదో పని అంటించడంలోనూ ఆడవారికి అదో తృప్తి! అందుకే నా భార్యకి నా జీతం గురించి తప్ప నా హోదా గురించి తెలియదు. నా కింద రెండు వందల యాభై మంది ఉన్నప్పటికీ వాళ్ళలో ఏ ఒక్కణ్ణీ నేను శాసించలేననే ఆమె అనుకుంటుంది.

నా స్నేహితుడు ప్రసాద్ ముందు నా హోదా ప్రదర్శించడంలో నాకో ఆనందముంది. ప్రసాద్ చిన్నప్పుడు నాకంటే గొప్పగా ఉండేవాడు. అందువల్ల అప్పుడప్పుడూ నన్ను కొంత

చిన్నబుచ్చేవాడు కూడా! అలాంటప్పుడు మా అమ్మ అతడితో--- ''మావాడితో మంచిగా ఉండవోయ్ ప్రసాదూ! రేపు వాడు నీకంటే గొప్పవాడౌతాడు'' అనేది. అందుకు ప్రసాదు చిన్నబుచ్చుకుంటే ''డబ్బు ఈరోజుంటుంది, రేపు పోతుంది. దాన్ని చూసుకుని ఎదుటివాళ్ళను చిన్నబుచ్చకూడదు. పెద్దయ్యాక మావాడు డబ్బు, హోదా సంపాదించలేకపోతే నన్నడుగు'' అనేది అమ్మ.

ఇప్పుడు నేను నిజంగానే ప్రసాదు కంటే పెద్ద హోదాలో ఉన్నాను. అందుకు ప్రసాదులో రవంత అసూయ తొంగిచూస్తూంటుంది. ఆ అసూయలో నాకు మా అమ్మ తృప్తి కనబడుతుంది. ఆ అసూయను మరింతగా పెంచడానికి నా హోదాను ప్రదర్శిస్తాను.

ఆ రోజు ప్రసాద్ చూస్తుండగా నా క్రింద ఉద్యోగులందరూ నన్ను చూసి గౌరవంగా లేచి నిలబడ్డారు. వినయంగా తలలు వంచారు. నేను గదిలోకి వెళ్ళి కూర్చున్నాను. ఎయిర్ కండిషన్డు రూము అది. ఇందులోకి నేను కొత్తగా మారాను. ప్రసాద్ ఆ గది చూసి అసూయపడి మా అమ్మ తృప్తినిపెంచాడు. అతడి కోసం నేను కూల్ డ్రింక్స్ తెప్పించాను.

ఇద్దరం కబుర్లలో పడ్డాం.

పైకి చెప్పడు కానీ ప్రసాదుకు నా హోదా గర్వకారణం. ఈ ఊరొచ్చినప్పుడు నన్ను కలుసుకోవడం, నా యింట్లో మకాం పెట్టడం, నా ఆతిథ్యాన్నందుకోవడం అతడి హోదాను పెంచుతాయి.

ప్రసాద్ తన గురించి ఏవో చెప్పుకుంటున్నాడు. నేను చిరునవ్వుతో అతడి మాటలు వింటున్నాను. నా చిరునవ్వు నా హోదాతోపాటు, అతడి మాటలపట్ల నా అనాసక్తతను కూడా స్పష్టంగా వ్యక్తం చేస్తోంది. అలాంటి చిరునవ్వు ఎవరి పెదాల మీద ఉంటే అతడు ఎదుటివారికంటే ఉన్నత స్థితిలో ఉన్నాడనీ ఎదుటివారి మాటలు వినడంలేదనీ అర్థం!

అలాంటి సమయంలో లోపలకు చప్రాసీ వచ్చి-- ''సార్! మీ కోసం ఒక ముసలామె వచ్చింది. అర్జంటుగా మిమ్మల్ని చూడాలంటోంది--'' అన్నాడు వినయంగా.

''ఎవరో అడిగావా?''

''మీకే చెబుతాననంటోంది'' అన్నాడు చప్రాసీ.

''సరే లోపలకు పంపు'' అన్నాను.

ఆ తర్వాత కొద్ది క్షణాల్లో తుఫాన్లా లోపలకు దూసుకువచ్చిందామె. ఆమె ఆకుపచ్చరంగు పాత చీర కట్టుకుంది. నుదుట రూపాయి కాసంత బొట్టు మెరుస్తోంది. ఆశ్చర్యంగా ఆమె కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి.

''నువ్వేనా ఆఫీసరువి!'' అనడిగిందామె. ఆమె గొంతులోని కఠినత్వానికాశ్చర్యపడుతూనే 'ఊ' అన్నాను. అంతే! ఆమె విజృంభించింది.

నా ముందున్న బల్ల, ఆ వెనుకనున్న నేను, ఆ ఎయిర్ కండిషన్డు గది ఇవేమీ నన్ను గొప్పవాణ్ణి చేయవందామె.

'నా కొడుకు ఆరడుగులున్నాడు. తలక్రిందులుగా తపస్సు చేసినా వాడంత పొడుగు కాగలవా నువ్వు? నా కొడుకు గొంతెత్తి పాడితే వాడి ముందు ఆ మహానుభావుడు ఘంటసాల కూడా బలాదూరే! అలా పాడగలవా నువ్వు? వాడిది పచ్చటి ఛాయ. అదొస్తుందా నీకు? అన్నిటినీ మించినది వాడి వినయగుణం. అది చూసే ముచ్చటపడి మా బంధువుల్లో ఒకాయన వాడికి నీకంటె పెద్ద ఉద్యోగమిస్తానంటే, ఇదైతే మా అమ్మా నాన్నల దగ్గరే ఉండొచ్చని మానేశాడు. ఆ ప్రేమాభిమానాలు నీకు చేతనౌతాయా? కాస్త అధికారముంది కదా అని ఫైలు వాడి మీద గిరవాటేస్తావా? నానా మాటలూ అంటావా? సస్పెండ్ చేస్తానని బెదిరిస్తావా? బిడ్డ మనసు పాడుచేసుకొని రోజంతా సెలవు పెట్టాడు. మా వారైతే నిన్ను ఈ ఊర్నించి ట్రాన్స్‌ఫర్ చేయించడానికి మినిష్టర్‌తో మాట్లాడతానని చిందులేస్తుంటే అంతదాక ఎందుకని వారించి నేనే ఇలా చక్కావచ్చాను'' అందామె తీవ్రంగా.

''అమ్మా! మీరు నిలబడే ఉన్నారు. కూర్చోండి'' అన్నాను నేను వినయంగా.

''ఈ నక్క వినయాలకేంలే, నా కొడుకు సంగతి చెప్పు. మళ్ళీ వాడి మీదకి ఫైలు విసురుతావా? సస్పెండ్ చేస్తానంటావా?''

''ఇప్పుడే మీరింటికి వెళ్ళి శ్యామలరావుని పంపండి. సెలవు కాన్సిల్ చేసుకోమనండి. నేను మీకు హామీ ఇస్తున్నాను. అతడినేమీ అనను''

''ఇప్పుడు నన్నేమీ అనలేక మళ్ళీ వాడు రాగానే విరుచుకు పడవుగదా! అల్లారుముద్దుగా పెంచాను. వాణ్ణెవరేమన్నాసరే భరించలేను'' అందామె కళ్ళొత్తుకుంటూ.

నేను హామీ ఇచ్చాక ఆమె వెళ్ళిపోయింది. అప్పుడు ప్రసాద్ కొత్త ఉత్సాహంతో నా వంక చూసి, ''ఇంకా ఏమో అనుకున్నాను. చదువురాని ఆవిడ నిన్నలా ఛీత్కరిస్తూంటే నోరెత్తలేదు నువ్వు. ఆ శ్యామల్రావు నిజంగా నీకంటే అన్నివిధాలా గొప్పవాడా లేక నీ కబుర్లన్నీ నాలాంటి వాళ్ళ దగ్గరేనా?'' అన్నాడు.

''ఆ శ్యామల్రావుకి బొత్తిగా పనిరాదు. తప్పు చేయని రోజుండదు. ఏమయిందో నిన్న ఎదిరించి కూడా మాట్లాడితే ఫైలు విసిరేసి సస్పెండ్ చేస్తానన్నాను. దాంతో భయపడిపోయినట్లున్నాడు.కానీ ఇలా సెలవు పెడతాడనీ, తల్లి వస్తుందనీ అనుకోలేదు.''

''వస్తేమాత్రం - నీలో తప్పు లేకపోతే ఆవిణ్ణి నువ్వు నానా మాటలూ అనొచ్చు. ఆవిడ కొడుకుని తీసిపారేయొచ్చు. ఇంకా చెప్పాలంటే అవతలకు పొమ్మనచ్చు.''

''డియర్ ప్రసాద్! ఆ పని చేసేవాణ్ణే - ఆమెలో అమ్మని చూడకపోతే! ప్రపంచంలో ఏ తల్లినీ ఎదుటపడి బాధపెట్టకూడదన్నది నా సిద్ధాంతం. ఆమెకు ఆమె కొడుకు గొప్ప! కాదని నేనెందుకు చెప్పాలి? అదీకాక శ్యామల్రావు ఒకవిధంగా నా కంటే గొప్పవాడే! అతడికి తల్లి ఉంది. నాకు లేదు'' అన్నాను.

అప్పుడు ప్రసాద్ ముఖం వెలిగింది. అతడికీ తల్లి ఉందన్న విషయం నాకప్పుడే గుర్తుకొచ్చింది. ★

*(వనిత మాసపత్రిక - సంక్రాంతి, 1990)*